క్లుప్తంగా

అసత్య ఆరోపణలు సరికాదు

• వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు


మాట్లాడుతున్న వెంకయ్యస్వామి ఆశ్రమ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు

వెంకటాచలం : భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆశ్రమ అభివృద్ధిపై, ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఆశ్రమ కమిటీ సభ్యులు, ఉభయకర్తలు, భక్తులు హితవు పలికారు. మండలంలోని గొలగమూడిలో ఉన్న వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద వారు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నెలలో జరిగిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలకు వెంకయ్యస్వామి బంధువులు వస్తే తగిన మర్యాదలు చేసి, స్వామి దర్శనం చేయించినట్లు చెప్పారు. అయితే ఆరాధన సమయంలో ఆశ్రమంలోపల కొబ్బరికాయలు కొట్టడం నిషేధమని చెప్పడంతో ఆశ్రమ అభివృద్ధిపై, ఈఓ పి.బాలసుబ్రహ్మణ్యంపై వెంకయ్యస్వామి బంధువులు అసత్య ఆరోపణలు చేయడాన్ని తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామని తెలియజేశారు. దేవుని ముందు అందరూ సమానమనే విషయం తెలుసుకోవాలన్నారు. ఏళ్ల తరబడిగా వెంకయ్యస్వామి ఆశ్రమం వద్దకు రాని బంధువులు ఆరాధనోత్సవాల సందర్భంగా గొలగమూడికి వచ్చి అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతికాదన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం రాత్రి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. హైదరాబాద్‌కు చెందిన భీమ్‌సింగ్, గోపికృష్ణసింగ్, శిరీష ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం


కొడవలూరులో పౌష్టికాహార ప్రదర్శన

కొడవలూరు : చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా రక్తహీనతను దూరం చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. జాతీయ పోషకాహార మాసోత్సవాల సందర్భంగా కొడవలూరు ఎన్టీఆర్ కాలనీలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార విలువలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లోనే పిల్లలకు పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్డీ.యాస్మిన్, ఎస్కే.రమీజా, వై.కామేశ్వరి, పి.శాంతి, ఎస్కే.అఫ్రీన్, కె.నాగరాజ పాల్గొన్నారు.

యల్లాయపాళెంలో..

యల్లాయపాళెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార విలువలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ మేరీ హెప్సిబా, వెల్ఫేర్ సహాయకుడు కె.మల్లికార్జున, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం పట్టివేత



విడవలూరు : మండలంలోని ముదివర్తి సమీపంలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని గ్రామస్తులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో కోళ్ల వ్యర్థాలను పూడ్చిపెట్టారు. అనంతరం వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు.

ప్రయాణికుల భద్రత గాలికి..

- ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ల విషయంలో నిర్లక్ష్యం
- బాక్సుల్లో కానరాని సామగ్రి
- ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స లేనట్టే
- పట్టించుకోని ప్రభుత్వం

జిల్లా పరిధిలో..	
డిపోలు	: ఏడు
బస్సులు	: 648


డ్రైవర్ వెనుక వైపు ఫస్ట్ ఎయిడ్ బాక్స్

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వం ప్రయాణికుల భద్రతను గాలికొదిలేసింది. ప్రయాణ సమయంలో చిన్న ప్రమాదం జరిగినా ప్రథమ చికిత్స జరిగే అవకాశం అంతంతమాత్రంగానే ఉంది. ఫస్ట్ ఎయిడ్ కిట్లు చాలా బస్సుల్లో లేవు. కొన్నింటిలో బాక్సులున్నా అలంకారప్రాయమే. పూర్తి స్థాయిలో వస్తువులను అందుబాటులో ఉంచాలనే కనీస విషయాన్ని ప్రభుత్వ పెద్దలు విస్మరించారు. ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించకుండా మొద్దునిద్రపోతూ మందుల కొనుగోలుకు నిధులు కేటాయించకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఆస్పత్రులు, దాతల కోసం ఎదురు చూస్తున్నారు.

లక్షల్లో ప్రయాణికులు

జిల్లాలో కావలి, కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు డిపోలున్నాయి. వీటిలో బస్సులు 648 ఉండగా, అందులో 135 వరకు హైర్ బస్సులున్నాయి. జిల్లావ్యాప్తంగా నిత్యం 1.3 లక్షల నుంచి 1.6 లక్షలకు పైగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రతినెలా సంస్థ ఆదాయం రూ.80 లక్షల నుంచి రూ.90 లక్షలు వరకు ఉంటోంది. నెల్లూరు నగరంలో ప్రధాన బస్టాండ్లు, 1, 2 డిపోలున్నాయి.

పట్టించుకోకుండా..

ఫస్ట్ ఎయిడ్ బాక్సుల నిర్వహణలో అధికారులు కూడా అలసత్వం వహిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. సిబ్బంది చెప్పినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో మందులు, సామగ్రి ఉంటే ఆస్పత్రికి తీసుకెళ్లేటప్పుడు డ్రైవర్, కండక్టర్లు ప్రథమ చికిత్స చేసే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ సమయంలో కచ్చితంగా ప్రథమ చికిత్స గురించి తర్ఫీదు ఇస్తారు. బాక్సుల్లో మందులు, సామగ్రి లేకపోవడంతో సిబ్బంది కూడా చేసేదిలేక గాయపడిన వారిని ఆస్పత్రులకు తీసుకెళ్తున్నారు.

ఏ సామగ్రి ఉండాలంటే..

స్టెరిలైజ్డ్ కాటన్ బండిల్స్ – 2, ఎలాస్టిక్ బాండేజ్ రోలర్స్ – 5, బెటాడియన్ ఆయింట్మెంట్ (యాంటీ సెప్టిక్ క్రీమ్) – 1, డెటాల్ లేదా స్యావ్‌లాన్ – 1, నియోసిన్ పౌడర్ డబ్బా – 1, సర్జికల్ బ్లేడ్ – 1, బర్నాల్ ఆయింట్మెంట్ – 1, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, వైట్ ప్లాస్టర్ టేప్ – 1, బ్యాండెయిడ్ ప్లాస్టర్, స్టెరిలైజ్డ్ ఎలాస్టిక్ ప్లాస్టర్ – 3 ఉండాలి.

అన్ని బస్సుల్లో ఏర్పాటు



ఇప్పటికే అన్ని ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉండేలా చర్యలు తీసుకున్నాం. ఎక్కడైనా లేకపోతే పరిశీలించి ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటాం.

– విజయరత్నం, నెల్లూరు ఆర్టీసీ ఆర్‌ఎం

సమస్యలు పరిష్కరించాలని వినతి


మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌కు సత్కారం

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, పెద్దాస్పత్రిలో డాక్టర్లు, వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ కోరారు. మెడికల్ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన గోవింద్‌ను మెడికల్ కళాశాలలోని ఆయన చాంబర్‌లో యూనియన్ నేతలు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ గంగాధర్, యూనియన్ జిల్లా కార్యదర్శి సందానీ, అధ్యక్షుడు కమ్మటి శ్రీనివాసులు, నేతలు జబ్బార్, గోవిందరెడ్డి, భాస్కర్, విజయకుమారి, రూత్, అస్లామ్, రాజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): దేశంలో నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించడంతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టపర్చాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిర్వహించ తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పిలుపు నిచ్చారు. సంతపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ధర్నాకు భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, కార్యవర్గ సభ్యులు సిరాజ్, రమణయ్య, మున్వర్, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోదాములపై సమీక్ష



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నిర్మించిన 44 బహుళ ప్రయోజన గోదాములపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ ఆనంద్ తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్ని గోదాముల్లో రైతులు తమ పంటలను నిల్వ చేసుకుంటున్నారని, మిగిలిన వాటిని పౌరసరఫరాల శాఖకు అద్దె ప్రాతిపదికన ఇచ్చేందుకు రాష్ట్ర సహకార సంఘాల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. డీసీఓ గుర్రప్ప, డీసీసీబీ సీఈఓ శ్రీనివాసరావు, నాబార్డు జిల్లా మేనేజర్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానాధికారి సుబ్బారెడ్డి, మార్కెటింగ్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ అనిత తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుందాం


ప్రత్యేక వాహనాలను ప్రారంభిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): వరద ముంపునకు గురైన విజయవాడ వాసులను ఆదుకోవడంలో నగర ప్రజలు భాగస్వాములు కావాలని కమిషనర్ సూర్యతేజ కోరారు. వరద బాధితుల సహాయార్థం 55 వేల అల్పాహార ప్యాకెట్లను తరలించే తొమ్మిది వాహనాలను జెండా ఊపి మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. హోటల్ అసోసియేషన్లు, కేటరింగ్ బృందాల సహకారంతో లక్ష మందికి మధ్యాహ్న, రాత్రి భోజనాలను సిద్ధం చేసి తరలించనున్నామని వెల్లడించారు. బాధితుల సహాయార్థం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నామని, దుస్తులు, ఇతర సామగ్రిని అందించి తోడ్పడాలని కోరారు. అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈలు సంజయ్, చంద్రయ్య, హెల్త్ ఆఫీసర్ చైతన్య, సిటీ ప్లానర్ దేవీకుమారి, మేనేజర్ ఇనాయతుల్లా, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల నాణ్యత పరిశీలన

వరద బాధితుల సహాయార్థం నగరంలోని షాదీ మంజిల్, ఏసీనగర్, కొండాయపాళెం, ఇస్కాన్ టెంపుల్, హనుమాన్ జంక్షన్ సమీపంలోని కేటరింగ్ కేంద్రాల్లో సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. ప్రత్యేక సిబ్బందిని నియమించి.. నిరంతరం పనులు జరిగేలా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ట్యాంకర్లు, డీజిల్ ఇంజిన్ల తరలింపు

పది తాగునీటి ట్యాంకర్లు, వరద నీటిని తోడేందుకు అవసరమైన తొమ్మిది డీజిల్ ఇంజిన్లను నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి తరలించారు. ఈఈ చంద్రయ్య, డీఈఈ ముజాహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుపూజోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల భవనంలో గురుపూజోత్సవాన్ని గురువారం ఉదయం నిర్వహించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీపీఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరించనున్నామని చెప్పారు.

కమిషనర్‌ను కలిసిన సబ్ కలెక్టర్



నెల్లూరు(బారకాసు): కందుకూరు సబ్ కలెక్టర్‌గా నియమితులైన శ్రీపూజ కమిషనర్ సూర్యతేజను నగరపాలక సంస్థ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు.

విద్యుత్ భవన్‌లో వన మహోత్సవం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్ ప్రాంగణంలో వన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మొక్కలు నాటిన అనంతరం ఎస్‌ఈ విజయన్ మాట్లాడారు. జిల్లా సర్కిల్ పరిధిలోని అన్ని విద్యుత్ డివిజన్లలో మొక్కలు నాటాలని కోరారు. ఈఈలు సోమశేఖర్‌రెడ్డి, రమేష్‌చౌదరి, నరేంద్రరెడ్డి, బెనర్జీ, డీఈఈలు అల్తాఫ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.రెండు లక్షల విరాళం



నెల్లూరు(దర్గామిట్ట): అనంతసాగరంలోని టీజీఎస్ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి రూ.రెండు లక్షల విరాళాన్ని కోలా ఓబయ్య, పెంచలయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ప్రకటించారు. ఈ మేరకు ఈ నగదును డీఈఓ రామారావుకు మంగళవారం అందజేశారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కోలా చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, అనంతసాగరం ఎంఈఓ కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో రెండో పంట ధాన్యం ధరలు రోజురోజుకూ పతనమవుతున్నాయని, రైతులు నష్టపోకుండా సత్వర చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటిరెడ్డి, హనుమంతరావు కోరారు. ఈ మేరకు డీఆర్వో లవన్నకు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. జిల్లాలో రెండో పంట వరికోతలు ప్రారంభమయ్యాయని, రూ.22 వేల వరకు పుట్టి కొనుగోళ్లు ఉండగా, ఒక్కసారిగా రూ.18 వేలకు పడిపోయాయని చెప్పారు. విచారణ జరిపి అన్నదాతలకు న్యాయం చేయాలని కోరారు. ఏవీఆర్ నాయుడు, కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ సభ్యత్వ నమోదు



నెల్లూరు సిటీ: పాఠశాలల అభివృద్ధి కోసం గౌరవప్రదంగా ఎన్నుకున్న ఎస్సెమ్సీ సభ్యులను బాత్‌రూముల్లో ఫొటోలు తీయాలనడం సమంజసం కాదని, నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బీటీఏ రాష్ట్ర వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య పేర్కొన్నారు. పాత వెల్లంటి, ఆమంచర్ల, పొట్టేపాళెం, దేవరపాళెం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన బీటీఏ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫొటోలు తీసే బాధ్యతను ఆయాలకు అప్పజెప్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అనంతరం బీటీఏ జిల్లా అధ్యక్షుడు మణి సుబ్బు మాట్లాడారు. 117 నంబర్ జీఓను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు పదేపదే చెప్పి, ప్రస్తుతం ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రూరల్ మండలాధ్యక్షుడు హనీఫ్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి సంపత్, సభ్యులు ఖాజారహంతుల్లా, హరి, రవి, హరి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

17న ఏపీఈజేయూ జిల్లా మహాసభలు


మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బారకాసు): ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏపీఈజేయూ) జిల్లా నాలుగో మహాసభలను నగరంలోని పురమందిరంలో ఈ నెల 17న నిర్వహించనున్నామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉడతా రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. యూనియన్‌కు సంబంధించిన జిల్లా నూతన కమిటీ ఎన్నికలను అదే రోజున నిర్వహించనున్నామని వివరించారు. ఆసక్తి గలవారు సభ్యత్వ నమోదులో పాల్గొనాలని కోరారు. జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు వెలసిరి కుమార్, రాష్ట్ర నేతలు రమేష్‌రెడ్డి, జావీద్, జిల్లా నేతలు సరళమ్మ, వరప్రసాద్, రిజ్వాన్, ఉదయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కోసం నానా అగచాట్లు



మాట్లాడుతున్న శ్రీనివాసులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యాప్తంగా ఇసుకను ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదని, దీంతో ఇసుక కోసం నానా అగచాట్లు పడాల్సి వస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘ నగర కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని పూలే విగ్రహ సమీపంలో గల భవన నిర్మాణ కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో 3.5 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారని, ఉచిత ఇసుక పాలసీపై ఎలాంటి ప్రకటన లేకపోవడంతో రీచ్‌లు మూతపడ్డాయని చెప్పారు. ఫలితంగా 40 రకాల పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనిలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయమై నిరసనలు చేపట్టి.. మంత్రులు, అధికారులకు వినతిపత్రాలను ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆరోపించారు. నేతలు అవుల పెంచలయ్య, సంపూర్ణమ్మ, సమీవుల్లా, చిరంజీవి, బాలరాజు పాల్గొన్నారు.

నెల పాటు చైతన్య ఉద్యమం

నెల్లూరు(బృందావనం): నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే నినాదంతో నగరంలో చైతన్య ఉద్యమ కార్యక్రమాలను నెల పాటు నిర్వహించనున్నామని జమాఅతె ఇస్లామి హింద్ మహిళా విభాగ నగర ఉద్యమ కన్వీనర్ అమీరా తెలిపారు. జెండావీధిలోని పానగల్‌రాజా రోడ్డులో గల సంస్థ కార్యాలయంలో కరపత్రాలు, లోగోను మంగళవారం ఆవిష్కరించారు. సంఘ సభ్యులు మలికాబేగం, ఆసియా, గౌహర్‌ఖాన్, సాహెబ్‌జాది, సఫియా అక్తర్, షంషాద్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలను తెలపాలి


మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల వివరాలను వైద్యశాఖకు ఎప్పటికప్పుడు తెలపాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ఎన్టీఆర్‌నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశ డే కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజలు, వైద్యశాఖకు వారధిగా ఆశ కార్యకర్తలు ఉండాలని కోరారు. కుష్టు, టీబీ వ్యాధులను సమాజం నుంచి తరిమికొట్టేందుకు చేపట్టాల్సిన సర్వేలు, పరీక్షలను వివరించారు.

సమాజంలోని పరిణామాలపై అవగాహన కల్పించాలి

• ఎస్పీ కృష్ణకాంత్



మాట్లాడుతున్న కృష్ణకాంత్


హాజరైన పోలీస్ అధికారులు తదితరులు

నెల్లూరు(క్రైమ్): కళాశాలలు, పాఠశాలల్లో కమిటీలను ఏర్పాటు చేసి సమాజంలో జరుగుతున్న పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్పీ కృష్ణకాంత్ సూచించారు. నెల్లూరు నగర, రూరల్ సబ్ డివిజన్ల పరిధిలోని కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్, పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలోని కొందరు యువత, విద్యార్థులు మత్తు, మాదకద్రవ్యాలకు బానిసై నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. కొందరు బాలికలు, యువతులు అపరిచిత వ్యక్తుల ఆకర్షణలో పడి ఇల్లు విడిచి వెళ్తూ, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వీటిని కట్టడి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని చెప్పారు. ఏఎస్పీ సౌజన్య, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాసరావు, గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ సందీప్‌కుమార్, అక్షర విద్యాలయ ప్రిన్సిపల్ కుముద, డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.